# 16. తప్పకుదారి

వచ్చిన పదిరోజులలోనే రాజారావుకూ, నాకూ పెద్ద స్నేహితమైంది. రోజూ ఇద్దరమూ షికారు వెళ్ళటం, అనేక విషయాల్ని చర్చించుకోవటమూ జరుగుతూండేది.

ఒక రోజున, కొత్తదోవ తొక్కాలని ఇద్దరమూ బయలుదేరాం. ఒక సందునపడి నడుస్తూండగా ఆమె కన్పించింది. మిగతా స్త్రీలకన్న విశేషం ఏదో ఆమెలో ఉండకపోతే, మా ఇద్దరి దృష్టినీ ఒక్కసారిగా ఆకర్షించి, నడుస్తూన్న వాళ్లను ఠక్కున రోడ్డుమీద నిలబడేట్టు చెయ్యలేకపొయ్యేదే. మరి ఆమె అందమో, శరీరాకృతిలోని ప్రత్యేకతో, పురుషుడికి అవసరమైన ముఖకళో, కళ్ళలోని మెరుపో- ఏదోకాని... కొన్ని క్షణాలవరకూ నన్ను నేను మరిచాను. భావకవుల ప్రేయసులూ, కథకుల అపురూప సౌందర్యమూర్తులూ కలిసి యీమెలో తాండవించారు.

ఈమె ఎవరు? ఇలా వాకిట్లో నిలబడి ఏ అదృష్టవంతుడి కోసం ఎదురు చూస్తోందో? ఏ విధంగానన్నా యీమె కొంతసేపైనా నా ఆధీనంలో వుండే మార్గం లోకంలో ఏమైనా వుందా? ఇలాటి సమస్యలు నాలో రేకెత్తినయ్. రాజాలోకూడా నేమో?

ఒక్కసారిగా, ఇద్దరమూ ఒకరి ముఖం ఒకరం చూసుకున్నాం. ఉన్నట్టుండి, నడిరోడ్డు మీద ఏ విధమైన కన్పించే ఆటంకమూ లేకుండా, ఇద్దరమూ ఇలా నిలబడిపొయ్యామే అనే ప్రశ్న- ఆశ్చర్యాన్ని తోడు తెచ్చుకొని, ఒకరినొకరం చూపుల్లోనే ప్రశ్నించుకునేట్టు చేసింది. కాని ఇది మన తప్పు కాదనీ, మానవు లందరికీ ఊపిరి పీల్చటం అంత సహజమైనదనీ, విశేషించి, ఇద్దరమూ ఒకరికొకరం దొంగలుగా పట్టుబడటంలో విశేషత ఉండదనీ- ఒక నిర్ధారణ, మాటలేమీ మధ్య జరగకుండానే, ఇద్దరిలోంచీ చిరునవ్వుతో బైటపడ్డది.

ఎటొచ్చీ, మా దారిన మేము పోవటమొక్కటే మిగిలింది. కాని ఆమె ఏదో ఆశపెడుతూ, మా తెల్లమొగాల వైపు వింతగా చూస్తోంది.

ఇంకో ముసలామె- ఆ చీకటింట్లోంచి బయటికి వచ్చి, మమ్మల్ని చూసి, "ఎందుకే అమ్మాయ్? ఊరికే నిలబడితే ఏం లాభం? కావాల్సినవాళ్ళూ, రసికులూ వాళ్ళంతట వాళ్ళే వస్తారు కాని- రోడ్డున నడిచే ప్రతివాడూ... అర్హుడేనా?" అంది, మాకు వినబడాలనే కాబోలు!

మాకు గుండె ఆగినట్టయింది. ఇంతా ఏడుస్తే, ఆమె ప్రబంధ నాయకీ కాదు. భావకవుల సౌందర్యమూర్తీ కాదు. వాస్తవిక ప్రపంచానికి సంబంధించిన వేశ్యాసుందరి! నాలో రేకెత్తిన సమస్యలన్నీ ఒక్కమాటతోనే పరిష్కరింపబడినయ్. ఆమె పొందుకు కుతూహలపడే కోర్కె- డబ్బుంటూ ఉంటేచాలు- తీరుతుంది: మిగతా ప్రేమ, గీమా, అర్హతా, అనర్హతా- వీటితో పనేలేదు. ఐనా, ఆ హృదయంలో ఏముందో తెలుసుకునే శక్తిలేని యీ మానవులకు, హృదయం పైభాగమే చాలామో?

...కాని, యీ సమయంలో, రాజా నాకు పెద్ద అడ్డంకి అయ్యాడు. నాకు నిజానికి ఇంతవరకూ వేశ్యలమీద మనస్సు పోనూలేదు, వారితో మాట్లాడే విధానమూ తెలియదు. ఐనా ఎప్పుడో ఒకప్పుడు 'మొదటిసారి' అవ్వాల్సిందే కనుక, అది ఇప్పుడే అయినా ఇబ్బందిలేదు. ఇంతవరకూ వేశ్యల్ని గూర్చి విన్నమాటల ఆధారంతో ధైర్యంగానే కార్యరంగానికి దూకవచ్చు. డబ్బుకు పెద్దప్రశ్నకూడా లేదు. ఇంతకూ రాజా ఒక్కడే సమస్యయ్యాడు.

ఇరవై రోజుల స్నేహంలోనూ రాజా చాలా నీతిపరుడని నాకు గ్రాహ్యమైంది. గంటల తరబడి మేము మాట్లాడుకున్నాం కాని, యీ వ్యభిచార ప్రశంశే ఎన్నడూ రాలేదు. ఒకవేళ ఎప్పుడన్నా దాని సరిహద్దులకువస్తే, రాజా చూపే విముఖతే, అతనిమీద నాకొక ప్రత్యేక గౌరవాన్ని సంపాయించింది. అందుకనే రాజాదగ్గర నేను జాగర్తగా ఉండటాన్ని నేర్చుకున్నాను. నా కసలు ఆ దుర్బుద్ధులు లేకపోయినా, మాటవరసలో ఏమన్నా దొర్లుతే మాత్రం- రాజా దృష్టిలో తక్కువౌతానేమోననే భయంకూడా ఉండేది.

అలాటి నేను - యీ సమయంలో మొదటిసారే ఏమాత్రం చలనాన్ని చూపినా, రాజా తప్పకుండా నన్నొక వేశ్యాలోలుడిగా జమకడతాడు. మొట్టమొదటిసారి యీ జాతి స్త్రీ కోసం చేసే ప్రయత్నం- రాజాకు తెలియకా, ఒకవేళ తెలియజెప్పినా నన్ను అతను నమ్మలేదని నేనుపడే బాధా- ఇంతకూ యీ నింద నా నెత్తినే అతను వేసే అవకాశాన్ని ఇయ్యటమూ- యీ గోలంతా చాలా వుంటుంది.

"మనం రసికులం కాదట! ఇంట్లోకి వెళ్దాం- పా" ఉక్రోషంతోనో, లేక ఉక్రోషాన్ని బాగా నటిస్తూనో అన్నాడు రాజా.

అసలే బోగంది ... అందుకని అసలు రసికత్వ మంటే ఏమిటో, అనుభవపూర్వకంగా, తెలుసుకున్న వన్నెలాడి. ఆమె ముందు మేము అరసికులంగా

వ్యవహరింపబడటం, నిజానికి ఎంత అవమానం! మా రసికత్వాన్ని, ముఖంలోనే చూసినట్టు మాట్లాడటాన్ని భరించటం- రసికత్వంలో కొద్దో, గొప్పో ప్రవేశంవున్న మమ్మ నిష్కారణంగా అనటం- నాలోకూడా ఉక్రోషాన్ని పురిగొల్పకపోలేదు. అసలు ఈ మాట అనేందుకుకానీ, అంటూండగా విని, 'నిజమే' నన్నట్టు తలతిప్పి, ఈ చవటల ఎదుటవుండటం తనకు పట్టనట్టే- చ్రరున వెళ్ళిపోవటంలో మాకు సూచించే హాస్యాస్పద నిరూపణకు కానీ- ఆమె అర్హురాలు కాదని ఎల్లాగైనా సరిపెట్టుకుంటే, ఒకవిధంగా సరిపోతుంది. కాని, నిజం చెప్పాలంటే- ఆ ఇంట్లోకి వెళ్ళి, ఏదో మాట సందర్భంలో, ఆమెను మరికాస్తసేపు చూస్తూ మాట్లాడుతూ ఆనందించవచ్చుననే నాకు తెలియని వాంఛ నన్నందుకు ఒప్పుకోనీలేదు. అందులోనూ రాజా యిచ్చిన ప్రోత్సాహంకూడా నాలో పనిచేసింది.

అతను నా సమాధానానిక్కూడా ఆగకుండా, ముందడుగు వేశాడు. ఇక, ఆమె దృష్టిలోలాగే, ఇతని దృష్టిలో కూడా నేను అరసికుణ్నవుతానేమోననే భయం నన్ను ముందుకు తోసింది. అసలు ఇదంతా తమాషాకు చేసే పని. ఈ నాటకం ఆడటంలో మాకు కావాల్సింది ఆత్మతృప్తే కాని, ప్రమాదాల్లోకి వెళ్ళటం కాదు. ఒక్కడుగు ముందుకుపడేప్పటికే- ఆమె ద్వారంలో నిలబడి, మా రాకకోసమే ఎదురుచూస్తూన్నట్టు మమ్మ ఆహ్వానించేందుకల్లే చిరునవ్వు నవ్వింది.

నేను వీధిలోకి అటూ, ఇటూ ఒకసారి చూసి, నన్ను ఎరిగిన వాళ్ళెవరూ చూపుమేరదూరంలో లేకపోవటాన్ని నా అదృష్టాల్లో జమవేసుకుంటూ- ఎల్లాగో కళ్ళుమూసుకొని రాజాను అనుసరించాను.

ఇద్దరమూ కూర్చున్నాం. కాని ఏం మాట్లాడాలో, ఎల్లా మాట్లాడితే, ఆమె నన్ను అనుభవజ్ఞుడిగా తీసుకుంటుందో, నాకు అర్థంగాక, మౌనమే మేలుగా తోచి, కార్యభారాన్ని రాజామీద వేస్తూన్నట్టు అతనివైపు చూశాను. రాజానవ్వి, ఒక నిమిషం ఏదో ఆలోచిస్తూన్నట్టు నటించి, తరువాత ఆమె ముఖంలోకి చూస్తూ "ఏం?" అన్నట్టు కనుబొమ్మల్ని ఎగరేశాడు.

"రాత్రికి ఉంటారా?" అంది ఆమె.

మా ఇద్దరికీ ఇదివరకు ఇలాటి అనుభవంలేదని ఆమెకు తెలియదు కాబోలు! ఒకవేళ తెలిసినా, యీ కప్పు కిందికి వచ్చాక అందరూ ఒకటే అవుతారనే గాఢనమ్మకమేదో ఆమెకు ఉండి వుంటుంది.

నేను గుడ్లప్పగించి, పల్లెటూరివాడు కొత్తగా టాకీ చూస్తున్నట్టు, కూర్చున్నాను. వారి మధ్య జరిగిన సంభాషణేమీ నా చెవికి ఎక్కలేదు. రాజా లేచేదాకా, నేనెక్కడ వున్నానోకూడా గ్రహించుకోలేకపొయ్యాను. విధిలేక, అతనితోపాటే నేనూ లేచాను. ఆమె నవ్వుతూ ద్వారందాకా సాగనంపింది. ఎల్లాగో రోడ్డుమీద పడ్డాం. 'నన్నెవ్వరూ

చూడలేదులే!' అని నాకు నేను చెప్పుకున్న సమాధానం, యీ పాపాన్ని చాలా వరకు నరికిపారేసింది.

ఐదారు నిమిషాల వరకూ ఎవ్వరమూ మాట్లాడకుండానే నడిచాం. బహుశా ఇద్దరమూ ఒకే విషయాన్ని గూర్చి, వేరు వేరు విధాలుగా మాలో మేమే విమర్శించుకుంటున్నామేమో?

చప్పున నాకు గుర్తొచ్చింది... అక్కడ రాజా ఆమెతో ఏం మాట్లాడినట్టూ? నన్ను ఇంతగా ఆకర్షించిన స్త్రీని గూర్చిన విశేషాల్ని వినటం, మళ్లీ ఆ వినటంలో నా అంతట నేనే కుతూహలాన్ని చూపకుండా వుండటం- అవసరంగా తోచింది.

భరించరాన్ని మౌనాన్ని తోసేస్తూ, "ఏం మాట్లాడవ్?" అన్నాను.

'నువ్వు వినలా?' అన్నట్టు నావైపు చూసి, "ఏముందీ? రాత్రికి పాతిక రూపాయిలు కావాలట!..." అన్నాడు.

"నువ్వేమన్నావ్?

"వస్తాలెమ్మన్నా..."

"మరి మాటెందుకిచ్చావ్?"

"ఎడ్వాన్స్ ఇవ్వలేదుగా! నోరుంటే ఖర్చుకాని మాటల్ని ఎన్నింటిని వదుల్తే మాత్రమేం?" అన్నాడు.

అంటే- నిజానికి రాజాకు నాలాగు ఆ వెధవ ఉద్దేశమే లేదన్నమాట! ఇంకా నయం; ఏకాస్త తొందరపడి, నా కోర్కెను సూచించినా తరువాత వేలు కొరుక్కోవాల్సి వచ్చేది.

"వెధవ వేశ్యలు!" అన్నాను. ఆమె సంసారస్త్రీ ఐతే మన రసికత్వమూ, ధైర్యమూ అనేకరెట్లు నిరూపించబడి గర్వపడేట్టు చేసేదన్నట్టు.

"కాక? ఇంటి దగ్గిర పండంటి భార్యలున్న మనకు వేశ్య లెందుకూ? ఏదో తమాషాకు చేశాం కాని, ఇంత చదువూ చదివి, చివరకు వేశ్యవలలో పడతామా?"

"డబ్బుకు డబ్బూ, ఆరోగ్యానికి ఆరోగ్యమూ దర్శించుకొని-" అన్నాను, అదెంత నీచమైన స్థలమో, విషపునవ్వుల్తో సూచిస్తూ.

"ఏం బతుకోయ్ - వాళ్ళది - ఎంత అందమైతే మాత్రం వేశ్యన్నాక, ఆమెకు విలువ వుంటుందీ? అదీకాక, యీ కరువుకాలంలో ఐదు హస్తాలట! ఐదుహస్తాలు!" అని రాజా కుడిముంజేయి జాపాడు.

తరువాత, వేశ్యలు లోకంలోకల్లా విలువలేని వ్యక్తులనీ, వారితోడి స్నేహం ఆ నీచతను, విలువలేనితనాన్నీ- మంచి వాళ్ళకుకూడా ఒద్దన్నా ప్రసాదించకమానదనీ, అసలు ఆ వేశ్యలపైని తలపే మాలాటి సత్ప్రవర్తకులకు కళంకాన్ని తెస్తుందనీ ఇద్దరమూ ఏకగ్రీవంగా తీర్మానించాం: ఆ సాయంత్రం ప్రాముఖ్యతగొన్న విషయం ఇదొక్కటే!

## 2

సాయంత్రం దీపాలు పెట్టేసరికల్లా రాజా ముఖంలో వ్యాకులతతో నా దగ్గరకు వచ్చాడు.

"ఏమిటీ విశేషం?" అన్నాను.

"మా అత్తగారికి ప్రాణంమీదికి వచ్చిందని నా కోసం మనిషివొచ్చాడు-"

"వెళ్ళు- యీ బండికే" అన్నాను.

రాజా కాస్త ఆగి, కొంచెం అనుమానంతో మెల్లిగా అన్నాడు: "నా దగ్గరేమీ డబ్బులేదు; నెలజీతం రాగానే తీసుకుందువుగాని... ఏమన్నా సర్దగలవా?"

ఇంత కష్టసమయంలో అడ్డుపడకపోతే - ఇంకెందుకొచ్చిన స్నేహితం? అందులోనూ, పంటబాపతు డబ్బు వచ్చి వారంకూడా కాలేదాయె!

"ఊఁ. తీసుకో- ఎంత కావాలీ?" అన్నాను.

"ముప్ఫై-"

"ముప్ఫయ్యా! రాజమండ్రీయేనా?"

"లేదు.. ఆమె విశాఖపట్నం హాస్పిటల్‌లో వుంది."

ఇక నేనేమీ మాట్లాడకుండా, అతనికి ముప్ఫయి రూపాయిలూ ఇచ్చి, వెంటనే బయలుదేరి వెళ్లమని సాగనంపాను.

భోంచేసి, యీజీఛైర్‌లో పడుకొని చల్లగాలి పీలుస్తూ ఆలోచించసాగాను. ఎంత ప్రయత్నించినా సాయింత్రం చూసిన ఆమె ముఖం మరుపు రాకుండా వుంది. ఆ అందాన్ని తొందరపడి, బజారు వస్తువులాగు అమ్ముకోకపోతే ఎంత విలువ ఉండేది! కాని అప్పుడు ఇలాటి ప్రాణుల బాధో?

ఇలాటి పిల్ల నా భార్యయితే? ఈ తలపు రాగానే, రాత్రి పదయేసరికల్లా, 'ఎందుకొచ్చిన జీవితం?' అన్నట్టు, యీసురోమంటూ మార్పేమీ లేకుండానే ఒకవేళ వున్నా వయస్సులో మరొక రోజు హెచ్చిందన్నట్టు సూచిస్తూ, పడకగదిని ప్రవేశించే భార్య జ్ఞాపకం వచ్చింది. ఇన్నాళ్ళూ నేను గుర్తించలేని అనేక లోపాలు నా భార్యలో కనిపించినయ్. నేనసలు తొందరపడి పెళ్లిచేసుకున్నాను కాని... ఆ వేశ్యలాటి అందమైన పిల్ల కోసం ఇంకా ఆగినట్టయితే ఎంత బాగుండేది! కాని తొందర పడకపోతే వృథాపోవాల్సిన జీవితంమాట జ్ఞాపకం రాలేదు. లోకం చూడక, సౌఖ్యం ఎక్కడవుందో తెలుసుకోలేక, ఒకవేళ తెలుసుకున్నా ఆశలు వదలుకోవాల్సీ- ఇంత వెధవగా ఎలా బతుకుతున్నానా అనిపించింది.

ఆ పిల్ల నాభార్య కావటం అసంభవం! కాని భార్యాత్వాన్ని వహించటం సంభవం. కాని యీ జీవితంలో అందుబాటులో వున్న అలాటి సౌఖ్యాన్ని ఒక్కసారైనా అనుభవిస్తేనేం? టోకుబేరం కుదరనప్పుడు, చిల్లరబేరాల్ని వదలుకోవటం దేనికీ? పాపమూ, అవినీతీ- వీటికి అందరి ఎదుటా భయపడటమూ లేక భయపడుతూన్నట్టు నటించటమూ, ఉగ్గుపాలతో పెట్టబడి నాలో జీర్ణించిందయినా, యీ చీకటిరాత్రి అంతగా భయపడాల్సిందేమీ లేదు: ఇది ఆమె ఆకర్షణలోని మాహాత్మ్యమేనేమో? పాపం అనేదాంటో మానవుడి ఆనందంలో ముప్పాతిక భాగాన్ని దాచి, ఇలా అందరికీ అన్యాయం చెయ్యటాన్ని ఒక్కసారిగా గుర్తించగలిగాను..... ఇక డబ్బువిషయం- ఎంత డబ్బు ఖర్చు కావటంలేదు? హాయిగా బతికేందుకు కాకపోతే, యీ వెధవడబ్బు ఏం చేసుకోను? ఇన్నాళ్లూ ఎక్కువ ఖర్చుతో తక్కువ సౌఖ్యాన్ని కొనుక్కున్నాం: కాని యీ బేరంమాత్రం నాకు బాగా లాభించేది లాగే కనిపించింది. మంచి అనుభవంలేని సంపాదన నిష్ప్రయోజనమనే సిద్ధాంతాన్ని, నాలాగే ఇదివరకే లోకంలో చాలామంది ఇలాటి సందర్భాల్లో కనిపెట్టారని తెలియక - నేనే మొట్టమొదట కనిపెట్టినట్టు భావించుకున్నాను.

ఏ కారణాలవల్ల నేను యీ సందర్భంలో పొరపడ కూడదో అవన్నీ బలహీనమయినై. నిజానికి ఇందాక రాజా ఎదుట తిట్టాననమాటేకాని, లోపల మనస్సు పీకుతూనే వుంది. పైన నీతిపరుడి బురఖా తగిలించుకోకపోతే లోకం ఏమంటుందో నన్న భయంతో బతుకు తయారైంది... కాని ఈ లోకానికి తెలియకుండా చెయ్యగలిగే పనులు ఎన్ని లేవు? పట్టుకోక పోతే దొరతన మయ్యేది. పట్టుకుంటే కద- దొంగతనమయ్యేది? ఈ చీకట్లో పనులు మానుకొని, నన్ను పట్టుకునేందుకని, నన్ను ఎరిగినవాళ్ళు ప్రత్యేకంగా నాకోసం ఎవరు కాచుకు కూర్చోవచ్చారు?... ఇంత చిన్న విషయాన్ని గూర్చి ఇంతసేపు ఆలోచించట మేమిటి? వెంటనే నిశ్చయంతో, సినిమావంక మీద రోడ్డెక్కాను.

ఒక్కరాత్రి పాతికరూపాయల సౌఖ్యం, పదిహేనురోజుల ఆఫీసుపనికి సరిపడే కష్టాన్ని అనుభవించబోతున్నాను. డబ్బు విలువ తెలిసినకొద్దీ- యీ సౌఖ్యం విలువకూడా పెరుగుతుంది కాబోలు! ఈ తలపులతో రక్తం సిద్ధంగావున్నానంటోంది. కాలు చరచరా ముందుకు సాగింది.

ఆమె ఇంటిమెట్లు ఎక్కబోతున్నాను. తలుపుదగ్గర రెండు కంఠాలు వినిపిస్తున్నయ్. చీకట్లో నక్కి విన్నాను.

"మళ్లీ దర్శనం?" అందామె.

"వీలుచూసుకొని వస్తాలే... నిన్ను మరిచిపోగలనా?... సరే పన్నెండయింది, వస్తా-"

ఈ రెండో కంఠం బాగా పరిచయమైందే... కాస్సేపటికల్లా రాజా సిగరెట్టు కాల్చుకుంటూ, తృప్తి కలిగిన ఆనందాన్ని సూచించేందుకల్లే, తలెత్తి పొగవదుల్తూ, చుట్టుపక్కల చూడకుండానే రోడ్డున పడ్డాడు. ఇదా ఇతని హాస్పిటల్ ప్రయాణం? ఇందుకా అప్పు?

మర్నాడు సాయంత్రం పనిగట్టుకొని, రాజా ఇల్లుదూరమైనా లెక్క చెయ్యకుండా వెళ్లాను. రాజా తలుపు తీసి, నన్ను చూసి రెండడుగులు వెనక్కు వేశాడు.

"ఊరు వెళ్లలేదేం?" అన్నా సంభాషణ మొదలుగా.

"రాత్రి వెళ్లి- తిరుగుబండిలో..." నీళ్లు నమిలాడు.

ఈ తప్పు చేసిన వాణ్ని చూస్తే నాకేదో లేని అధికారం వచ్చినట్టయింది. అందులోనూ యీపాడు బుకాయింపు నా కోపానిక్కూడా కారణమైంది.

"నాకు తెలుసులే... రాత్రే రానూ పోనూ- పాతిక రూపాయిలలో ప్రయాణం పూర్తయింది కదూ?" అన్నాను.

రాజా తెల్లమొగంవేసి, తలవంచి కాస్త ఆలోచించి నవ్వుతూ అన్నాడు: "ఆఁ.... ఆగు ప్రబుద్ధుడివి నువ్వు కూడా తయారయ్యావన్నమాట?"

"నేనా?" అన్నా, ఇతనికెల్లా తెలిసిందా అని ఆశ్చర్యపడుతూ.

"ఆఁ. నువ్వే స్వామీ! ఆ సమయంలో తమరక్కడికి రాకపోతే, నా సంగతి ఎల్లా తెలిసిందో కాస్త చెప్పు-" అని విరగబడి నవ్వసాగాడు.

ఒకణ్ని తప్పుచేసిన వాణ్నిగా నిలబెట్టాలని వెళ్లి, నేనూ తప్పుచేసిన వాణ్నే అయ్యానన్నమాట! ఇంతకుముందు రాజా మీద నాకు ఏర్పడ్డ చిన్నచూపంతా, క్షణంలో మాయమైంది.

"అబ్బాయీ! ఇది మానవ సహజం: ఇందులో విచారించాల్సిందేమీ లేదు... అందరూ ఇంతే!" అన్నాను. తప్పు చేసిన మానవుడు, తన తప్పును మానవ ప్రపంచానికంతటికీ అంటగట్టి వాటిలోనే విధిగా తనకు రావాల్సిన క్షంతవ్యతను తెచ్చుకునే విధానాన్ని యీ విజ్ఞానంతో కనిపెట్టగలిగాడు.

తప్పుచేసిన వాడు, తనలాటి ఇంకోణ్ని, ఆ తరువాత తనను కూడా సమర్థించుకోవటాన్ని నిరూపిస్తూ, రాజా "నిజం... నువ్వు చెప్పింది ముమ్మాటికీ నిజం-" అన్నాడు. గుప్పెటతో చెక్కటేబిల్ మీద గుద్దుతూ.

ఆ తరువాత, ఆమెలోని సౌందర్యాన్నీ, ఆమె రసికత్వ ప్రదర్శనాల్నీ గూర్చి- ఇద్దరమూ చాలాసేపటి వరకూ చర్చించుకున్నాం.

- మార్చి, *1942*